సాక్షి
మహబూబాబాద్
సోమవారం | 4 | ఆగస్టు | 2025



అప్రమత్తతే ఆయుధం..
పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలిపారు.
- 8లో▸



క్రీడా హబ్‌గా వరంగల్
భవిష్యత్‌లో వరంగల్ క్రీడా హబ్‌గా మారుతుందని ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
33^0 /26^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రివేళ అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి



కొత్తగూడ: హక్కుల సాధనకు ఆదివాసీలంతా ఐక్యంగా ఉద్యమించాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగబోయిన రవి సూచించారు. మండల కేంద్రంలో జరిగిన ఆదివాసీ సంఘాల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓవైపు అక్రమ వలసలు, మరోవైపు ప్రభుత్వాల అలసత్వంతో ఆదివాసీలు తమ అస్తిత్వం కోల్పోయే ప్రమాదం ఉందని, అన్ని సంఘాలు సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మన ఐక్యతకు ఈనెల 9న జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సం వేదిక కావాలని అన్నారు. అందుకు అందరూ కలిసి వచ్చి భవిష్యత్ కార్యాచరణ రూపొందించాలన్నారు. పలు ఆదివాసీ సంఘాల నాయకులు సందీప్‌దొర, సతీష్, వెంకన్న, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారానయణ, ప్రశాంత్, ఉద్యోగ సంఘాల నాయకులు సిద్దబోయిన బిక్షం, సుంచ సారయ్య, కల్తి ఎల్లయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యలో అంతరాలు తొలగించాలి



కేయూ క్యాంపస్: విద్యలో అంతరాలు తొలగించాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. 'విద్యలో అంతరాలు–అసమానతలు తొలిగిపోయేది ఎలా' అంశంపై హనుమకొండలోని యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఆదివారం నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడారు. విద్యారంగంలో ప్రైవేటీకరణతోనే అంతరాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక విద్యాసంస్థలు దిక్కులేనివిగా తయారయ్యాయని తెలిపారు. ఇంజనీరింగ్‌లో రూ.45 వేల నుంచి రూ.1,51,600 వరకు ఫీజులు ఉన్నాయని వివరించారు. ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, తెలంగాణ ఉద్యమకారుల వేదిక చైర్మన్ కె. వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రపంచీకరణతో విద్యారంగంలో అంతరాలు బాగా పెరిగిపోయయన్నారు. ఈ అంతరాలు పోవాలంటే ప్రగతిశీల భావాలున్న ప్రజాశ్రేణులను ఐక్యం చేసి పాలకవర్గాలపై పోరాటం చేయడమే మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. పౌరస్పందన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధేశ్యాం మాట్లాడుతూ 1980 నుంచే విద్య వ్యాపార సరుకుగా మారిందన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యలో అంతరాలు పోవాలంటే ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ సంఘాలు బాధ్యుల లక్ష్మారెడ్డి, రామమూర్తి, శ్రీధర్‌గౌడ్, విజయకుమార్, వీరస్వామి, రాజిరెడ్డి, పెండెం రాజు, రవీందర్‌రాజు, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి : సీపీ సన్‌ప్రీత్‌సింగ్




వరంగల్ క్రైం: రిటైర్డ్ పోలీసులు, ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘ కాలం విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఏఎస్సై వీవీఎల్ఎన్ మూర్తి, హెడ్‌కానిస్టేబుల్ జె.కేశవ్, కానిస్టేబుల్ ఎం.ఎల్లయ్య, నాలుగో తరగతి ఉద్యోగి కె.యాదయ్యను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రిటైర్డ్ అధికారుల సేవలు నేటితరం పోలీసులకు ఆదర్శమని, ప్రశాంత వాతావరణానికి మీ సేవలే కారణమని పేర్కొన్నారు. అదనపు డీసీపీ, శ్రీనివాస్, ఆర్‌ఐలు నాగయ్య, సతీశ్, ఆర్ఎస్సై శ్రవణ్, రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు కన్నెపల్లి పంపు హౌస్ సందర్శన

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు కన్నెపల్లి పంపుహౌస్‌ను నేడు (సోమవారం) బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సందర్శించనున్నారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆధ్వర్యంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుకంటి చందర్, దాసరి మనోహర్‌రెడ్డి, రసమయి బాలకిషన్, వొడితల సతీష్‌బాబు, సుంకే రవిశంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రానున్నారు.

అధికారుల నిర్లక్ష్యం!

ఎల్‌ఆర్ఎస్ కోసం డబ్బులు చెల్లించి ఎదురుచూపులు
- ప్రొసీడింగ్స్ కోసం కార్యాలయాల చుట్టూ ఇళ్ల స్థలాల యజమానుల ప్రదక్షిణ
- కొర్రీలు పెడుతూ కాలయాపన చేస్తున్న ఉద్యోగులు



సాక్షి, మహబూబాబాద్: ఇంటి స్థలాల క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం 25శాతం రాయితీ కల్పించింది. కాగా, సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ ఉద్యోగులు చెప్పిన మాటలు విని ఫీజులు చెల్లించిన వారు ఇప్పుడు ప్రొసీడింగ్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అప్పుడు అన్నీ బాగానే ఉన్నాయని డబ్బులు తీసుకున్న అధికారులు ఇప్పుడు రకరకాల కొర్రీలు పెడుతూ.. ప్రొసీడింగ్స్ ఇవ్వడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

క్రమబద్ధీకరణ అవుతుందని..

ఎల్‌ఆర్ఎస్ ఫీజులో 25శాతం రాయితీ కల్పించి నెలరోజుల గడువు ఇచ్చారు. ఇది 2020 డిసెంబర్ 31 వరకు రూ.1000 చెల్లించి రశీదులు తీసుకున్న వారికే వర్తింపజేశారు. ఈమేరకు మహబూబాబాద్, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల పరిధిలో 26,001 మంది రూ.1000 చెల్లించి రశీదులు తీసుకున్నారు. అయితే ఇందులో ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 20,586 దరఖాస్తులు ఎల్‌ఆర్ఎస్ చెల్లించుకునేందుకు అర్హత ఉందని అధికారులు చెప్పారు. దీంతోపై నాలుగు మున్సిపాలిటీల పరిధిలో భూయజమానులకు ఆయా మున్సిపాలిటీల్లోని ఉద్యోగులు ఫోన్లు చేయడం, ఫ్లెక్సీలు పెట్టి అవగాహన కల్పించారు.

రూ.16.49 కోట్ల ఆదాయం..

ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ జిల్లా కేంద్రంతోపాటు తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఎల్‌ఆర్ఎస్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో కార్యాలయాలకు వెళ్లి కొందరు, ఆన్‌లైన్ ద్వారా మరికొందరు ఫీజులు చెల్లించారు.

మున్సిపాలిటీల్లోని ఎల్‌ఆర్ఎస్ వివరాలు

మున్సిపాలిటీ	అర్హత పొందిన దరఖాస్తులు	ఫీజు చెల్లించినవి	ప్రొసీడింగ్ ఇచ్చినవి
మహబూబాబాద్	12,304	4044	1004
తొర్రూరు	6,181	2015	1267
మరిపెడ	1,228	427	78
డోర్నకల్	873	222	222
మొత్తం	20,586	6,708	2,571

ఇలా మహబూబాబాద్ మున్సిపాలిటీలో రూ.11.60కోట్లు, తొర్రూరు రూ.4కోట్లు, డోర్నకల్ రూ. 50లక్షల, మరిపెడ రూ. 99లక్షల ఆదాయం వచ్చింది.

ప్రొసీడింగ్స్‌లో జాప్యం

మున్సిపల్ అధికారులు మూడు దశల్లో పరిశీలన చేసి మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అన్ని సక్రమంగా ఉన్నాయని చెప్పిన తర్వాతనే భూ క్రమబద్ధీకరణకు ఫీజు తీసుకున్నారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు కలిపి మొత్తం 20,586 మంది డబ్బులు చెల్లించారు. ఇందులో 6,708 మంది రూ.16,49,60,000 చెల్లించారు. ఇందులో 2,571 మందికి మాత్రమే ప్రొసీడింగ్స్ ఇవ్వగా 4,137 మంది మున్సిపాలిటీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఫీజులు చెల్లించడంతో తమ భూమికి ఎలాంటి ఇబ్బందులు రావని భావించిన యజమానులకు మున్సిపల్ అధికారులు ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగంలోని కొందరు ఉద్యోగులు ప్రొసీడింగ్ వెంటనే ఇవ్వాలంటే తమకు ముడుపులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు ప్రచారం. అదే విధంగా ఎల్‌ఆర్ఎస్ చలాన్‌లు చెల్లించిన తర్వాత ఇప్పుడు భూమి విలువలో తేడా పడిందని.. కొత్త లెక్కల ప్రకారం చూస్తే మరిన్ని డబ్బులు చెల్లించాలని చెబుతున్నట్లు యజమానుల అంటున్నారు. ఇప్పటికే డబ్బులు చెల్లించామని ఇప్పుడు మళ్లీ డబ్బులు అంటే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు చెల్లించిన తమకు ప్రొసీడింగ్‌లు వెంటనే ఇచ్చేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని ఇళ్ల స్థలాల యజమానులు కోరుతున్నారు.

ఉత్తమ బోధన.. మెరుగైన సౌకర్యాలు

- డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ
- జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ మీడియంలో బోధన
- అత్యాధునిక టెక్నాలజీతో కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటు



జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా అడ్మిషన్లకు అవకాశం కల్పించారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా ఇంగ్లిష్ మీడియంలో బోధన చేపడుతున్నారు. మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో ఏటా అడ్మిషన్ల సంఖ్య పెరుగుతోంది.

కళాశాల అభివృద్ధి..

జిల్లాలోని తొర్రూరు, కేసముద్రం, మరిపెడ, గార్ల, మానుకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో 1983లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ గ్రూపులతో ప్రారంభమైంది. ప్రస్తుతం కళాశాలలో 575 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. కళాశాల అభివృద్ధిపై అధ్యాపకులు ప్రత్యేక దృష్టి పెట్టారు. అత్యాధునిక టెక్నాలజీతో కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లిష్ లెర్నింగ్ ల్యాబ్, సైన్స్, బాటనీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు తరగతి గదుల్లో సీసీ కెమెరాలు, డిజిటల్ తరగతులు, స్మార్ట్ బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే కళాశాలలో మంచి వాతావరణం, ఆహ్లాదాన్ని అందించేందుకు మొక్కలు నాటిసంరక్షించే బాధ్యతలు చేపడుతున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రత్యేక చొరవతో ఇంగ్లిష్‌లో బోధన జరుగుతోంది. దీంతో గత సంవత్సరం నుంచి విద్యార్థుల అడ్మిషన్లు భారీగా పెరిగాయి. అంతే కాకుండా క్రీడలు, పీజీ సెట్ ర్యాంకుల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు.

కళాశాలలోని కోర్సులు..

బీఏ (హెచ్ఈపీ), బీకాం కంప్యూటర్స్, జనరల్, బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఏ (హెచ్‌పీసీఏ), బీఎస్సీ (బైపీసీ), బీఎస్సీ (బీజెడ్‌సీ) కోర్సులు ఉన్నాయి. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన కొనసాగుతోంది. కాగా, న్యాక్‌లో 2.98 పాయింట్లతో జాతీయ స్థాయిలో మానుకోట డిగ్రీ కళాశాల బి–ప్లస్‌ప్లస్ గ్రేడ్ గుర్తింపు పొందింది. కళాశాల నుంచి చాలా మంది విద్యార్థులు పలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు సాధిస్తున్నారు.

నాణ్యతా ప్రమాణాలతో విద్య



మానుకోట డిగ్రీ కళాశాలలో అన్ని కోర్సులను తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నాం. ఇక్కడ చదివిన విద్యార్థులు దేశంలోని పలు యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల్లో సీట్లు సాధించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఒక వరంలాంటిది. బాలికలకు ప్రత్యేకంగా బీసీ బాలికల హాస్టల్ డిగ్రీ కళాశాల ఆవరణలోనే కలెక్టర్ చొరవతో ఏర్పాటు చేశాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలి.

– లక్ష్మణ్‌నాయక్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

అధ్యాపకుల ప్రోత్సాహంతోనే ర్యాంకు సాధించా..



ప్రతీ సబ్జెక్టులో సందేహాలు ఉంటే వెంటనే అధ్యాపకులు నివృత్తి చేసేవారు. ఎప్పటి సిలబస్ అప్పుడే పూర్తి చేసేది. కళాశాల అధ్యాపకుల ప్రోత్సాహంతో నేను బ్యాచలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ)లో 28వ ర్యాంకు సాధించాను.

–యాప శిరీష, కళాశాల విద్యార్థిని

'స్థానిక'ం తర్వాతే..

డీసీసీలకు కొత్త సారథులు!?
- బ్లాక్, మండల అధ్యక్షులు కూడా యథాతథం
- పునరాలోచనలో పార్టీ అధిష్టానం
- నామినేటెడ్ పోస్టుల భర్తీకి ఓకే.. త్వరలో డైరెక్టర్ పోస్టుల నియామకం
- అసెంబ్లీ నియోజకవర్గానికి రెండు.. నగరాల్లో ఐదు కావాలన్న ఎమ్మెల్యేలు
- ఇటీవలే ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులతో సమావేశం



సాక్షిప్రతినిధి, వరంగల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అన్ని స్థాయిల్లో సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. ఇందుకోసం ఆ పార్టీ అధిష్టానం తరచూ సమావేశాలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయి నుంచి కేడర్ కదిలించేందుకు కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మండల, బ్లాక్, జిల్లా కాంగ్రెస్ కమిటీలు వేయాలని మొదట భావించింది. ఏప్రిల్ 24 నుంచి జిల్లాల వారీగా ఇన్‌చార్జ్‌ల ద్వారా సమావేశాల ఏర్పాటు చేసి ఆశావహుల పేర్లను కూడా సేకరించింది. ఆ తర్వాత కొద్ది రోజులకే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా మీనాక్షి నటరాజన్ బాధ్యతలు చేపట్టడం.. పార్టీ పరంగా కొత్త మార్గదర్శకాలను రూపొందించడంతో సంస్థాగత కమిటీల ప్రస్తావన మరుగున పడింది. ఇప్పుడు నామినేటెడ్ పోస్టుల భర్తీతోపాటు సంస్థాగత కమిటీలపై చర్చ జరుగుతుండగా.. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో మార్పులు, చేర్పులు మంచిది కాదన్న ఆలోచనలో అధిష్టానం ఉన్నట్లు చెబుతున్నారు. అయితే, రాష్ట్రస్థాయి కమిటీలకు డైరెక్టర్ల కోసం మాత్రం ఎమ్మెల్యేల ద్వారా పేర్లను సేకరించారు.

పదవులకు ప్రామాణికం 2017 కటాఫ్.. మహిళలకు ప్రాధాన్యం

రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ హైదరాబాద్‌లో ఇటీవల ఉమ్మడి జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ నుంచి జిల్లా ఇన్‌చార్జ్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావడంతోపాటు సంస్థాగత, నామినేటెడ్ పదవుల పైన చర్చ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా నియమించేందుకు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గం నుంచి రెండు పేర్లు ఇవ్వాలని సూచించినట్లు తెలిసింది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలకు సంబంధించి 24 మంది పేర్లను ఎమ్మెల్యేలు సూచించాల్సి ఉంది. వరంగల్ అర్బన్ ప్రాంతాల్లో రెండింటితో సరిపెట్టలేమని, ఐదు వరకు ఇవ్వాలని ఎమ్మెల్యేలు మీనాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లగా.. పరిశీలిస్తామన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా రాష్ట్రస్థాయి డైరెక్టర్లతోపాటు జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టుల్లో మహిళలకు ప్రాధాన్యం ఉండేలా చూడాలని, 2017 సంవత్సరం కంటే ముందు నుంచి పార్టీలో ఉన్న సీనియర్ నాయకులకు కూడా మొదటి దఫాలోనే అవకాశం ఇవ్వాలని సూచించినట్లు సమాచారం. కష్టపడే నాయకులు, కార్యకర్తలకు పదవులు ఇవ్వాలని అధిష్టానం భావిస్తున్నదని, ప్రజాప్రతినిధులు సీనియర్లను ఎంపిక చేయాలని మీనాక్షి సూచించినట్లు తెలిసింది. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు నియోజకవర్గాల వారీగా అర్హులను ఎంపిక చేసే పనిలో ఉన్నారు. ఇదే సమయంలో సీనియర్లు, ఆశావహులు పదవుల కోసం మళ్లీ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పరిశీలనలో ఉన్న డీసీసీ ఆశావహుల పేర్లు ఇవే...

వాస్తవానికి జిల్లా కాంగ్రెస్ కమిటీలను మే నాటికి పూర్తి చేయాలని అధిష్టానం భావించింది. ఈ మేరకు ఏప్రిల్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలను కలుపుకుని డీసీసీల నియామకానికి జిల్లాకు ఇద్దరు చొప్పున పరిశీలకులను నియమించింది. మే 20 నాటికి డీసీసీ అధ్యక్షుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని భావించి కసరత్తు చేశారు. ఒకవేళ స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే సంస్థాగత కమిటీలు వేయాలని అధిష్టానం భావిస్తే జిల్లాల వారీగా ఆశావహుల జాబితాను మరోసారి పరిశీలించి ఖరారు చేసే అవకాశం ఉందని సీనియర్లు చెబుతున్నారు. ఇదే జరిగితే జిల్లాల వారీగా ఒక్కసారి పరిశీలిస్తే హనుమకొండ డీసీసీ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఉండగా.. ఆయన కాదంటే సీనియర్ల స్థానంలో బత్తిని శ్రీనివాస్, ఇనుగాల వెంకట్రాం రెడ్డి, పింగిళి వెంకట్రాంనర్సింహారెడ్డిలలో ఒకరికి అవకాశం దక్కవచ్చు. వరంగల్ జిల్లా అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణనే కొనసాగించాలన్న ప్రతిపాదన వచ్చినా.. రాజకీయ సమీకరణలు మారితే నమిండ్ల శ్రీనివాస్, గోపాల నవీన్‌రాజ్, కూచన రవళిరెడ్డి పేర్లు వినిపించాయి. మహబూబాబాద్ డీసీసీ అధ్యక్షుడి విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న జె.భరత్‌చందర్‌రెడ్డినే కొనసాగిస్తారన్న చర్చ ఉండగా.. ఇక్కడి నుంచి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, సునావత్ రాధ కూడా ఆశిస్తున్నట్లు చెప్తున్నారు. అయితే, డోర్నకల్, మహబూబాబాద్, ఎమ్మెల్యేలు రామచంద్రునాయక్, మురళీనాయక్ తోపాటు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి నిర్ణయం కీలకంగా కానుంది. జయశంకర్ భూపాలపల్లి డీసీసీ అధ్యక్షుడిగా పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్, చల్లూరి మధు తదితరుల పేర్లు ఉన్నాయి. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామ డీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తుండగా.. ఈయనను మార్చితే హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, సింగాపురం ఇందిర, మొగుళ్ల రాజిరెడ్డి, లకావత్ ధన్వంతి పేర్లు పరిశీలించారు. ములుగు జిల్లాకు కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్‌కే మళ్లీ అవకాశమన్న ప్రచారం జరుగగా.. మంత్రి ధనసరి సీతక్క కుమారుడు సూర్య, మల్లాడి రాంరెడ్డి, గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, బాదం ప్రవీణ్ పేర్లు కూడా ప్రచారంలో ఉన్నాయి.

చి'వరి'కి నీరందేనా?

- చెట్లు, పిచ్చిమొక్కలతో పూడుకుపోయిన కట్టుకాల్వ
- మున్నేరువాగు వద్ద తెరుచుకున్న ఒకే షట్టర్
- చివరి ఆయకట్టు రైతుల ఆందోళన



అమ్మపాలెం సమీపంలో చెట్లతో మూసుకుపోయిన కట్టు కాల్వ



కాల్వ నుంచి మళ్లీ మున్నేరు వాగులోకి వెళ్తున్న నీరు



తహసీల్దార్ బంజర సమీపంలో నీరు లేని కాల్వ

డోర్నకల్: నిండుగా మున్నేరు వాగు.. దానికి అనుసంధానంగా సుమారు 12కిలోమీటర్ల పొడవుతో కట్టుకాల్వ నిర్మాణం.. సుమారు 2,000 ఎకరాల ఆయకట్టు పారుతోంది. డోర్నకల్, అమ్మపాలెం తహసీల్దార్ బంజర, పాపటపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతులు వందల ఎకరాల్లో పంటలు సాగు చేస్తున్నారు. అయితే పిచ్చి మొక్కలు, చెట్లు మొలిచి కట్టుకాల్వ చివరి ఆయకట్టుకు సాగు నీరందకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆరు కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు..

కట్టుకాల్వలో కొంతకాలం క్రితం సుమారు 6 కిలోమీటర్ల మేర లైనింగ్ పనులు చేపట్టారు. మున్నేరువాగుకు డోర్నకల్ వైపు కట్టుకాల్వకు నీటిని విడుదల చేసేందుకు రెండు షట్టర్లు ఏర్పాటు చేసి వాగు నిండుగా ఉన్న సమయంలో షట్టర్లు తెరిచి కాల్వకు నీటిని విడుదల చేస్తున్నారు. వానాకాలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో రైతులు ప్రధాన పంటగా వరితో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్నారు.

చివరి ఆయకట్టుకు చేరని నీరు..

పలు కారణాల వల్ల కట్టుకాల్వ చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండి రైతులు నష్టపోతున్నారు. మున్నేరువాగు వద్ద రెండు షట్టర్లు ఉండగా ఒక షట్టర్ డోర్‌తో పాటు పైభాగంలో డోర్ తెరిచే పరికరాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో ప్రస్తుతం ఒకే షట్టర్‌ను తెరిచి నీటిని విడుదల చేస్తున్నారు. కాల్వలో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుగా మారాయి. కిలోమీటర్ల మేర చెట్లు, గడ్డి, పిచ్చి మొక్కలు పెరగడంతో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. మున్నేరు వాగు నుంచి సుమారు కిలోమీటరు దూరంలో కాల్వ నీటి ప్రవాహం కోసం చిన్నపాటి టన్నెల్ నిర్మాణం చేశారు. సక్రమంగా నిర్మాణం చేపట్టకపోవడం, నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో కాల్వ నిండి నీరు రోడ్డు మీదుగా తిరిగి మున్నేరు వాగులోకి ప్రవహిస్తోంది. అలాగే కాల్వకు అక్కడక్కడా గండ్లు పడడంతో నీరు వృథాగా పోతోంది.

ఆ గ్రామాలకు అందని నీరు..

చివరి ఆయకట్టు గ్రామాలైన తమసీల్దారు బంజర, సీతారాంపురం తదితర గ్రామాల రైతుల భూములకు నీరందడం లేదు. ప్రస్తుతం కట్టుకాల్వ ప్రారంభంలో నిండుగా ప్రవహిస్తుండగా తహసీల్దారు బంజర సమీపంలో కాల్వలో చుక్క నీరు కనిపించదు. కట్టుకాల్వ నీటిని నమ్ముకుని పంటలు సాగు చేస్తున్న ఆయకట్టు చివరి రైతుల పంటలు చేతికందే దశలో ఎండిపోతున్నాయి. ఏటా వానాకాలం ముందు కట్టుకాల్వలో చెట్లు తొలగించి శుభ్రం చేయాలని, పూర్తిస్థాయి కాల్వకు సిమెంట్ లైనింగ్ పనులు చేపట్టాలని అధికారులను వేడుకుంటున్నా పట్టించుకోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి కాల్వ పూర్తిస్థాయి మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



మున్నేరువాగు నుంచి 12 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న కట్టుకాల్వకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. చాలా చోట్ల చెట్లు, పిచ్చి మొక్కలు పెరగడంతో కాల్వకు గండ్లు పడి చివరి ఆయకట్టుకు సాగు నీరందడం లేదు.

–వేల్పుల వెంకన్న, రైతు, తహసీల్దారు బంజర

రుద్రేశ్వరున్ని దర్శించుకున్న రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ



స్వామికి పూజలు చేస్తున్న డీజీపీ సౌమ్యమిశ్రా

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల ఆలయాన్ని తెలంగాణ జైళ్ల శాఖ డీజీపీ సౌమ్యమిశ్రా ఆదివారం సందర్శించారు. ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, అర్చకులు మంగళవాయిద్యాలతో స్వాగతించారు. ఆమె ముందుగా ఉత్తిష్ట గణపతిని దర్శించుకుని రుద్రేశ్వరస్వామికి లఘున్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ నాట్యమండపంలో ఉపేంద్రశర్మ తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు, మహదాశీర్వచనం అందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను వరంగల్ జిల్లాలో పనిచేసినప్పుడు చాలా సార్లు వేయిస్తంభాల ఆలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. స్వామివారిని దర్శించుకుంటే కొంత మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయ ఈఓ అనిల్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అనంతరం భద్రకాళి దేవాలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు.

హేమాచలక్షేత్రంలో సండే సందడి





ప్రత్యేక అలంకరణలో స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి, దర్శించుకుంటున్న భక్తులు

మంగపేట: మండల పరిధిలోని మల్లూరు హేమాచలక్షేత్రానికి ఆదివారం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆదివారం సెలవురోజు కావడంతో ఆలయంలోని స్వయంభు లక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, కరీంనగర్, హైదరాబాద్ తదితర సుదూర ప్రాంతాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, గుంటూరు, రాజమండ్రి వంటి ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఉదయాన్నే గుట్టపైకి చేరుకుని ఆలయ సమీపంలోని చింతామణి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో ఆలయంలోని స్వామివారిని దర్శించుకుని తిలతైలాభిషేకం పూజలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు స్వామివారికి తిలతైలాభిషేకం పూజలు నిర్వహించి స్వామివారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తుల గోత్రనామాలతో అర్చనలు జరిపించారు. స్వామివారి విశిష్టత, ఆలయ చరిత్రను వివరించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిలతైలాభిషేకం పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. సంతానం కోసం వచ్చిన దంపతులకు నాభిచందన ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిత్య అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల స్తోమత మేరకు నిత్య అన్నదాన కార్యక్రమ నిర్వహణకు విరాళాలను అందజేశారు.

ముగ్గురు నకిలీ వైద్యులపై కేసు



అమ్మ ఫస్ట్ ఎయిడ్ ఆస్పత్రిలో తనిఖీలు చేస్తున్న అధికారులు(ఫైల్)

నెక్కొండ: వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని ముగ్గురు నకిలీ వైద్యులపై కేసు నమోదు చేసినట్లు టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం..గత మే 22న స్థానిక రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న ఫస్ట్ ఎయిడ్ సెంటర్ రుద్ర, లావణ్య, అమ్మ ఆస్పతుల్లో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఎటువంటి అర్హతలు లేకుండా ఆదర్శ వైద్యులుగా చెప్పుకుంటూ, క్లినిక్స్ నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రథమ చికిత్స కేంద్రాల ముసుగులో అశాస్త్రీయ పద్ధతులలో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నొప్పి ఇంజక్షన్లు వేయడం, ల్యాబ్ టెస్ట్‌లు నిర్వహించడం, సెలైన్లు పెట్టడం, ఆస్పత్రిలో బెడ్స్ ఏర్పాటు చేయడం వంటివి చేయడం ఆయా తనిఖీల్లో వెలుగులోకి వచ్చిందన్నారు. కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ డి.లాలయ్యకుమార్, చైర్మన్ డాక్టర్ కె.మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎన్ఎంసీ చట్టం 34, 54, టీఎస్ఎంపీఆర్ చట్టం 22, బీఎన్ఎస్ 318, 319 ప్రకారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. నకిలీ వైద్యులు లావణ్య ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు ఎం.రమేశ్, రుద్ర ఫస్ట్ ఎయిడ్ సెంటర్ బి.రవి, అమ్మ ఫస్ట్‌ఎయిడ్ సెంటర్ డి.అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు డాక్టర్ నరేశ్‌కుమార్ పేర్కొన్నారు.

రేపటి వరకు సైన్స్ కాంగ్రెస్ రిజిస్ట్రేషన్ గడువు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఈనెల 19, 20, 21వ తేదీల్లో తెలంగాణ అకాడమీ సైన్స్, కాకతీయ యూనివర్సిటీ సంయుక్తంగా తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్ నిర్వహించనున్నాయి. సైన్స్‌కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు అధ్యాపకులు, పరిశోధకులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఈనెల 5 వరకు గడువు పొడిగించినట్లు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఇప్పటివరకు సైన్స్‌కాంగ్రెస్‌కు 658 అబ్‌స్ట్రాక్ట్‌లు రాగా 476మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆయన తెలిపారు.

పేలిన లారీ టైరు..

- అక్కడికక్కడే డ్రైవర్ మృతి
- వంగపహాడ్ సమీపంలో ఘటన

హసన్‌పర్తి: టైరును పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు పేలింది. ఈ ప్రమాదంలో ఓ లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం యాదాద్రి–ఆరెపల్లి జాతీయ రహదారి మార్గమధ్యలోని వంగపహాడ్ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన పి. సాయిలు(40) షాబాద్ బండల లోడ్ లారీతో జాతీయ రహదారిపై ములుగు వైపునకు బయలుదేరాడు. అయితే వంగహాడ్ సమీపంలో లారీ ఆపి టైరును పరిశీలిస్తుండగా ఒక్కసారిగా పేలింది. ఈ ఘటనలో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



అప్రమత్తతే ఆయుధం..

నిర్లక్ష్యం వహిస్తే ప్రాణానికే ముప్పు

- పురుగు మందుల పిచికారీలో ఏమరుపాటు వద్దు
- రైతులకు అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు



మహబూబాబాద్ రూరల్ : పంటలపై పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లేని పక్షంలో రైతులు, వ్యవసాయ కూలీల ప్రాణాల మీదకు వచ్చే ప్రమాదం ఉంది. పురుగు మందులు అత్యంత ప్రమాదకరం. ఈ క్రమంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రాణానికే ముప్పు అని గుర్తించాలి. పురుగు మందులు శరీరంలోకి వెళ్లినా, వాసన పీల్చినా ఆరోగ్యానికి హానికరం. రైతులు వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, కూరగాయలు, పండ్ల తోటలకు కలుపు, చీడపీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. పంటకు హాని జరుగుతుందన్న ఏమరుపాటులో జాగ్రత్తలు తీసుకోవడం మరచిపోతున్నారు. ఈ క్రమంలో ప్రాణాంతక రసాయన మందుల వినియోగం విషయంలో ఏమరుపాటు వద్దని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పురుగు మందులు పిచికారీ చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు.



పరిమితికి మించి వినియోగం హానికరం..

పంటను ఆశించిన తెగుళ్లు, పురుగుల నిర్మూలనకు ఇష్టమొచ్చిన పురుగు మందులు చల్లితే ఉపయోగం ఉండదు. విష తీవ్రతలో తేడా ఉంటుంది. పిచికారీ చేసేసమయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అస్వస్థతకు గురవుతారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, పెస్టిసైడ్స్ దుకాణాదారుల సూచనలు పాటించాలి. పరిమితికి మించి పంటలకు మందులు పిచికారీ చేస్తే మేలుకన్నా నష్టం ఎక్కువ జరుగుతుంది. జాగ్రత్త వహించకుంటే పంటకు మేలుచేసే సాలీడు, అక్షింతల పురుగులు మృత్యువాతపడతాయి. మిత్ర పురుగులు పొలంలో లేకుంటే పంటకు హానిచేసే పురుగుల ఉధృతి పెరుగుతుంది.

అవసరమైన పరికరాలు వాడాలి..

పంటలకు పురుగుమందులు వాడడానికి వ్యవసాయశాఖ సూచించిన స్ప్రేయర్లనే వాడాలి. ముఖ్యంగా పంటలో మొక్కల స్థాయిని బట్టి స్ప్రేయర్లు ఉపయోగించాలి. పత్తిలో హ్యాండ్ స్ప్రేయర్, పవర్ స్ప్రే యర్ల కంటే తైవాన్ స్ప్రేయర్ల ద్వారా మొక్కలకు నేరుగా మందు పిచికారీ చేసే వీలుంటుంది. చేతులకు గ్లౌజ్‌లు, కళ్లద్దాలు, ముఖానికి మాస్క్, తలకు టోపీ లేదా రుమాలు తప్పనిసరిగా ధరించాలి. చేతి వేళ్లకు గోళ్లు పెంచుకోకూడదు. పత్తిలో అయితే కాళ్లకు బూట్లు ధరించాలి. ఉదయం, సాయంత్రం గాలి ఎదురుగా వచ్చేటప్పుడు పురుగుమందు పిచికారీ చేయొద్దు. గాలి వీస్తున్న వైపే వెళ్తూ పిచికారీ చేయాలి. పురుగు మందు పిచికారీ సమయంలో పొగ తాగొద్దు. పొగాకు ఉత్పత్తులు, గుట్కాలు తినొద్దు. చేతులు నోట్లో పెట్టుకోవడం, కళ్లు నలుచుకోవడంలాంటి పనులు అస్సలు చేయొద్దు.

పురుగు మందులపై అవగాహన ఉండాలి



పంటలను ఆశించే చీడపీడల నివారణకు ఉపయోగించే పురుగు మందులపై రైతులు అవగాహన పెంచుకోవాలి. ముఖ్యంగా పెస్టిసైడ్ దుకాణాల్లో పురుగు మందులు నాలుగు రంగుల్లో లభ్యమవుతాయి. వీటిలో పుర్రె గుర్తుతో ఉన్న రంగు, ఆకుపచ్చ, నీలి, పసుపు రంగులతో కూడిన డబ్బాలు ఉంటాయి. పుర్రె గుర్తుతో కూడి ఎర్ర రంగు ఉంటే అత్యంత విషపూరితమని గుర్తించాలి. ఆకుపచ్చ రంగు చిహ్నంతో ఉంటే తక్కువ విషపూరితమని తెలుసుకోవాలి.

బి.క్రాంతికుమార్, కోఆర్డినేటర్, మల్యాల కేవీకే

స్ప్రేయర్‌తోనే పిచికారీ చేయాలి..

- పంట ఏపుగా ఉంటే చేతిపంపుతో కాకుండా స్ప్రేయర్ తోనే పిచికారీ చేయాలి. కొన్ని రకాల పురుగుమందులు మాత్రం పవర్ స్ప్రేయర్‌తో పిచికారీ చేయొద్దు. స్ప్రేయర్‌తో పిచికారీ చేస్తే మందు గాలిలో కలిసి ఇతర పంటలపై పడితే పంట నాశనమై పోతుంది. అందుకే వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. అలాగే, గాయాలైన చేతులతో మందు పిచికారీ చేయొద్దు. పిచికారీ పూర్తయిన వెంటనే కాళ్లు, చేతులు సబ్బుతో కడుక్కోవాలి. తలస్నానం చేయాలి.
- పిచికారీ చేసే సమయంలో ప్రత్యేక దుస్తులు మాత్రమే ధరించాలి. వాటిని విడిచిన తర్వాత మిగతా దుస్తులతో కలిపి ఉతకొద్దు. పిల్లలకు పురుగు మందులను సాధ్యమైనంత దూరంగా ఉంచేలా జాగ్రత్త పడాలి. పిచికారీ అనంతరం వినియోగించిన పురుగు మందు డబ్బాలను గోతి తీసి పాతిపెట్టాలి.

పురుగు మందు ప్రభావానికి గురైతే వెంటనే ఇలా చేయాలి..

- పురుగు మందు ప్రభావానికి గురైతే వెంటనే ఆ వ్యక్తి నోట్లో వేలుపెట్టి వాంతి చేయించాలి.
- మూర్ఛపోయిన సందర్భంలో మూతికి గాయం కాకుండా రెండు దవడల మధ్య గుడ్డ ఉంచాలి.
- శరీర ఉష్ణోగ్రతను తగ్గించేందుకు తడిబట్టతో నెమ్మదిగా తుడవాలి.
- శరీర ఉష్ణోగ్రత బాగా తగ్గితే దుప్పటికప్పి వెచ్చగా ఉంచాలి.
- సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లాలి.
- అనారోగ్యానికి కారణమైన పురుగు మందు వివరాలు డాక్టర్‌కు తెలపాలి.

జాగ్రత్తలు ఇలా తీసుకోవాలి ..

- పురుగు మందు డబ్బా మూత నోటితో తీయొద్దు.
- మందు ద్రావణాన్ని చేతితో కలపొద్దు.
- మందు ఒకేసారి సరిపడా కలుపుకోవాలి.

పవర్ స్ప్రేయర్ నాజిల్‌ను పెద్దగా చేయొద్దు.

- పిచికారీ సన్నగా, తుంపరలా ఉండేలా చూడాలి.
- మందు తగిన మోతాదులోనే పిచికారీ చేయాలి.
- మోతాదుకు మించితే పంటలకు ప్రమాదం.
- ఒకేసారి రెండు లేదా మూడు రకాల పురుగు మందులు కలిపి పిచికారీ చేయొద్దు.



ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 177 మంది చిన్నారులకు విముక్తి

- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



వరంగల్ క్రైం : ఆపరేషన్ ముస్కాన్ 11వ విడత ద్వారా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పనులు చేస్తున్న 177 మంది చిన్నారులకు విముక్తి కల్పించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు బాలల సంరక్షణ విభాగం, చైల్డ్ లైన్, కార్మిక శాఖతో కలిసి ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల్లో వివిధ ప్రాంతాల్లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారన్నారు. ఇందులో బాల కార్మికులు, బడి మానేసిన 177 మంది బాలబాలికలను గుర్తించి వారిని బాలల సంరక్షణ గృహానికి పంపించినట్లు సీపీ తెలిపారు. ఇందులో 149 మంది బాలలు, 28 మంది బాలికలు ఉన్నారన్నారు. బాలల సంరక్షణ గృహానికి తరలించిన వారిలో తెలంగాణ , ఇతర రాష్ట్రాలకు చెందిన 97 మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. మిగతా ఆరుగురిని వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకున్న యజమానులకు రెండేళ్ల జైలు శిక్ష,రూ. 50 వేలు జరిమానా విధిస్తామన్నారు.

ఇల్లు, పింఛన్ ఇస్తేనే కిందికి దిగుతా!

- లిస్ట్‌లో పేరున్నా మంజూరు చేయడం లేదని ఆరోపణ
- తానంచర్లలో సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి నిరసన
- అధికారులతో మాట్లాడి మంజూరు చేయిస్తామని నచ్చజెప్పిన పోలీసులు



సెల్‌ఫోన్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న రాములు



రాములు

మరిపెడ రూరల్: ఇందిరమ్మ ఇల్లు, పింఛన్ ఇవ్వలేదని ఓ వ్యక్తి సెల్‌టవర్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం తానంచర్ల గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాసనపల్లి రాములు అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనట్లు లిస్టులో పేరు వచ్చింది. అయినా తనకు ఇల్లు మంజూరు చేయలేదని, అలాగే తనకు కన్ను కనిపించడం లేదని, దానికి పింఛన్‌కు దరఖాస్తు పెట్టుకున్న ఇవ్వడం లేదని రాములు ఆరోపించాడు. ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఇల్లు, పింఛన్ మంజూరు కాకపోవడంతో మనస్తాపం చెందిన రాములు గ్రామ శివారులో ఉన్న సెల్‌టవర్ పైకి నిరసన వ్యక్తం చేశాడు. గంట దాటినా అతడు సెల్‌టవర్ దిగకపోవడంతో అక్కడికి పెద్దసంఖ్యలో స్థానికులు చేరుకున్నారు. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రాములుకు నచ్చజెప్పారు. ఆదివారం కావడంతో అధికారులు ఎవరూ రారని, సోమవారం మాట్లాడి ఇల్లు, పింఛన్ మంజూరు చేయిస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించి కిందకు దిగాడు. ఈ విషయంపై గ్రామ కార్యదర్శి మౌనికను వివరణ కోరగా..రాములకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైన విషయం వాస్తవమేనని, కానీ ఇంటి స్థలం విషయంలో వారి అన్నదమ్ముల మధ్య గొడవలు ఉండటంతో పెండింగ్‌లో పెట్టినట్లు తెలిపారు. అన్నదమ్ములు ఇంటి స్థలం పంచుకున్న తర్వాత రెండో విడతలో ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తామని రాములుకు చెప్పినట్లు కార్యదర్శి పేర్కొన్నారు.

బొగత వద్ద పర్యాటకుల సందడి



వాజేడు: ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామసమీపంలోని బొగత జలపాతం వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. బొగత అందాలను వీక్షించడంతో పాటు కొలనులో దిగి స్నానాలు చేశారు. బొగత నుంచి జాలువారుతున్న జలధారలను తిలకిస్తూ సెల్ఫీలు, ఫొటోలు దిగి సరదాగా గడిపారు. ఫ్రెండ్‌షిప్ డే కావడంతో యువ పర్యాటకులు భారీగా తరలివచ్చి ఎంజాయ్ చేశారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- వాగులో మునిగి యువకుడి మృతి
- స్నేహితుల దినోత్సవంలో విషాదం



అభిషేక్ (ఫైల్)

మంగపేట: స్నేహితుల దినోత్సవం విషాదం నింపింది. స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు వాగులో మునిగి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం బుచ్చంపేట గ్రామానికి చెందిన బూర్గుల రమేశ్, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు అభిషేక్(22) ఉన్నారు. అభిషేక్ డిగ్రీ వరకు చదివి ఇంటివద్ద ఉంటూ తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో ఆసరాగా ఉంటున్నాడు. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన మిత్రులు కార్తీక్, రుత్విక్, దేవేందర్, మనీశ్, విశ్వతేజతో కలిసి సరదాగా గడిపేందుకు ఐదు కిలోమీటర్ల దూరంలోని జబ్బోనిగూడెం సమీపంలోగల గౌరారంవాగు గుండుర్లాళ్ల ప్రాంతానికి ఈతకు వెళ్లారు. వాగులో దిగి నీటిలో మునిగిపోయిన అభిషేక్ స్నేహితులకు కనిపించలేదు. ఆందోళనకు గురైన వారు గుంతల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. వెంటనే విషయాన్ని గ్రామస్తులు, కుటుంబానికి సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఈతగాళ్లు వాగులో గాలించి అభిషేక్ మృతదేహాన్ని బయటకు తెచ్చారు. సంతోషంగా బయటకు వెళ్లిన ఒక్కగానొక్క కుమారుడు విగతజీవిగా కనిపించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

విద్యారణ్యపురి: మల్టీజోన్–1 పరిధిలోని వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీ పరిధిలోని 19 జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్ల గ్రేడ్–2 పదోన్నతుల ప్రక్రియ కోసం సీనియారిటీ జాబితా ఆయా జిల్లాల్లోని డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆదివారం డీఈఓ కార్యాలయాల్లో అభ్యంతరాలు స్వీకరించారు. ఈనెల 4న మధ్యాహ్నం వరకు అభ్యంతరాలు స్వీకరించి అనంతరం డీఈఓలు వాటిని పాఠశాల విద్యాశాఖ ఆర్‌జేడీకి పంపనున్నారు. ఈనెల 5న పరిష్కరించి తుది సీనియారిటీ జాబితాను వెల్లడిస్తారు. ఈనెల 6న పదోన్నతుల కోసం వెబ్ ఆప్షన్లు ఇచ్చుకుంటారు. ఏమైనా లోపాలు ఉంటే కూడా అదేరోజు సరిచేసుకునేందుకు (ఎడిట్) అవకాశం ఇచ్చారు. ఈనెల 7న స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లు గ్రేడ్ 2గా పదోన్నతుల ఉత్తర్వులు ఇవ్వనున్నారు.

హాస్టల్ వార్డెన్‌పై విద్యార్థి కుటుంబీకుల దాడి

గూడూరు: మండలంలోని సీతానగరం గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి సిగరెట్ తాగుతుండగా ఆదివారం వార్డెన్ గుర్తించి మందలించారు. ఈ విషయాన్ని విద్యార్థి తన తల్లిదండ్రులకు మరో రకంగా చెప్పాడు. వెంటనే ఊరు నుంచి పాఠశాలకు చేరుకున్న విద్యార్థి బంధువులు జరిగిన విషయం తెలుసుకోకుండా అసభ్యకరంగాప్రవర్తిస్తూ వార్డెన్‌పై దాడికి పాల్పడ్డారు. సహ విద్యార్థులు ఎంత చెప్పినా వినకుండా దాడికి పాల్పడ్డారని వార్డెన్ కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై విద్యార్థులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన చెప్పారు.

క్రీడా హబ్‌గా వరంగల్..

- వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు
- జేఎన్ఎస్‌లో అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం
- హాజరైన 1,400 మంది అథ్లెట్లు





100 మీటర్ల పరుగు పందెన్ని ప్రారంభిస్తున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, చిత్రంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారుడు



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: భవిష్యత్‌లో వరంగల్ క్రీడాహబ్‌గా మారుతుందని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు అన్నారు. ఆదివారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 1,400 మంది అథ్లెట్లు హాజరయ్యారు. అండర్ –14, 16, 18, 20 బాలబాలికల విభాగాల్లో నిర్వహించే పోటీలను వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి ముందుకొచ్చారన్నారు. ఈ ఏడాది నుంచే క్రీడా పాఠశాలలో తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు విద్య, వైద్యం, వ్యవసాయంతో పాటు క్రీడారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎమ్మెల్యేల మందరం కలిసికట్టుగా జిల్లా క్రీడాభివృద్ధి, వసతుల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. అనంతరం 5కే మీటర్ల పరుగు పందెంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన అథ్లెట్లకు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: వరంగల్ జిల్లా చదరంగ సమాఖ్య ఆధ్వర్యంలో శ్రీరామ్‌లైఫ్ ఇన్సూరెన్స్ సహకారంతో హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో ఆదివారం ఓపెన్ టు ఆల్ ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి చదరంగ(చెస్) పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 50 మంది క్రీడాకారులు హాజరైనట్లు టోర్నమెంట్ నిర్వహణ కార్యదర్శి పి. కన్నా తెలిపారు. సాయంత్రం వరకు సాగిన పోటీల్లో మొదటి మూడు రౌండ్లు ముగిసే సరికి షేక్‌రియాజ్, అభినవ్‌సాయి దామెర, నరిగె యశ్వంత్, రామా రిషిత్‌కుమార్ ముందంజలో ఉన్నట్లు తెలిపారు.



చెస్ ఆడుతున్న క్రీడాకారులు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLATS FOR SALE

- Ready to Occupy 1 BHK, 2BHK & 3 BHK Flats with all Facilities for Sale @ 941 Sqft to 1914 sqft with reasonable Prices at Vikas Nagar & Basith Nagar. Ph: 8897221187, 9177592357. [WA-6753]

SERVICES

సర్టిఫికేట్ పోయినవి

- MATHANGI SANGEETHA, D/O. MATHANGI ISSACK, R/o. H.No. 25-6-278/1, విద్యానగర్, కాజీపేట్ మండలం, హన్మకొండ జిల్లా గార్లవి SSC Memo, Inter Memo, BBM Degree Provisional Memo, MBA & B.Ed లవి అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్స్ తీసుకొని బైక్ పై సోమిడి నుండి కాజీపేట్‌కి వస్తుండగా దారిలో పడిపోయాయి. దొరికినవారు తెలుపగలరు. ఫోన్ నెంబర్: 8801711137. [SCA25006986]

WANTED

- Multinational Company Part Time / Full time work Training / Support Given. Contact No: 8106144217. [WA-6754]
- స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA): శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122 [B-1275596]

FACULTY TEACHERS

- Wanted teachers to teach English up to 8th class. Contact Cell No: 9849943040. [SCA25006983]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ చదువు నాతోని అయితలే.. చనిపోతున్నా

- అర్థం కాని చదువు.. ఆగిన జీవితం
- ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం
- పుట్టిన రోజుకు మూడు రోజుల ముందే తనువు చాలించిన విద్యార్థిని



శివాని మృతదేహం

నయీంనగర్/వరంగల్ క్రైం: 'ఈ చదువు నాకు అర్థం ఐతలే. ఎంత కష్టపడ్డా రావట్లేదు. మీకు చెప్తే మీరు అర్థం చేస్కుంటలేరు. నాకు టెన్షన్ ఐతాంది. మైండ్ పోతాంది. నేను చదువుకుందాం అనుకున్న గ్రూపు మీరు ఒప్పుకోలె. మీకిష్టమైన గ్రూపు నాతోని ఐతలే. ఏం అర్థం కాక మధ్యలో నలిగిపోతున్న. ఇంత తక్కువ మార్కులు వస్తుంటే మీరు తట్టుకోలేరు. అందుకే చనిపోతున్నా' అంటూ ఇంటర్ విద్యార్థి ఉసురు తీసుకుంది. ఆ తల్లిదండ్రులకు గుండెకోత మిగిల్చింది. మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన మిట్టపల్లి కుమార్, కవిత దంపతులు పెద్ద కుమార్తె శివాని. ఈఏడాది ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో చేర్పించారు. మరో మూడు రోజులైతే ఆమె పుట్టిన రోజు రాబోతోంది. ఇంతలోనే ఈ ఘటన జరగడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. హనుమకొండ జిల్లా నయీంనగర్‌లోని ఓ ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న మిట్టపల్లి శివాని(17) ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది. తెల్లవారుజామున నాలుగు గంటలకు స్నానానికి వెళ్లిన ఆమె ఎంతసేపయినా కనిపించకపోవడంతో.. ఆమె స్నేహితురాలు కళాశాల సిబ్బందికి విషయం తెలిపింది. అనంతరం శివానిని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న శివాని తల్లిదండ్రులు, బంధువులు, విద్యార్థి సంఘాలు శివాని మృతికి యాజమాన్యమే కారణమని కళాశాల ఎదుట బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. తండ్రి మిట్టపల్లి కుమార్ మాట్లాడుతూ.. తెల్లవారుజామున నాలుగు గంటలకు ఘటన జరిగితే తనకు 8:50 గంటలకు కాల్ చేశారని.. తమ అనుమతి లేకుండా శివానిని ఆస్పత్రికి తరలించారన్నారు. తన కూతురుకు తెలుగు రాకపోయినా తెలుగులో సూసైడ్ నోట్ ఎలా రాస్తుందని ప్రశ్నించారు. కళాశాల సిబ్బంది వేధింపులతోనే తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని, సూసైడ్‌నోట్ కూడా కళాశాల యాజమాన్యం సృష్టించిందని ఆరోపించారు. హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, ఎస్సై కిశోర్‌కుమార్ పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. శివాని తండ్రి మిట్టపల్లి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హనుకొండ ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్ తెలిపారు.

కంటతడి పెట్టించిన సూసైడ్ నోట్

'మమ్మీ.. చెల్లిని బాగా చదివించండి. మంచి కాలేజీలో మంచి గ్రూప్ తీసుకోమను. నాలాగా అర్థం కాని చదువు వద్దు. దాన్ని మంచిగా చదివించి మీరు మంచిగా ఉండండి. కాలేజీలో జాయిన్ చేసే ముందు ఎవరినైనా కొంచెం అడిగి జాయిన్ చేయండి. చెల్లి నువ్వు కూడా మంచిగా చదువుకోవే.. ఆ చదువు నాకు అర్థం ఐతలే. మీకు చెప్తే మీరు అర్థం చేసుకుంటలేరు. నాకు మొత్తం టెన్షన్ ఐతాంది. మైండ్ పోతాంది. మీరు చెప్పిన చదువు నాతోని ఐతలే. నేను చదువుదాం అనుకున్న చదువుకు మీరు ఒప్పుకోలే. చివరికి నాకు చావే దిక్కు అయ్యింది. ఏం అర్థం కాక మధ్యలో నలిగిపోతున్న. ఈసంవత్సరం అంటే మీరు ఫీజు కట్టారని ఏదోలా కింద మీద పడి ఉన్న. ఇగ నాతోని కాదు. నేను వెళ్లిపోతున్న నాకు ఇంత తక్కువ మార్కులు రావడం నేను, మీరు తట్టుకోలేరు. అందుకే చనిపోతున్నా. అందరూ జాగ్రత్త. మంచిగా ఉండండి. ఈఒక్క సంవత్సరం కూడా మీకోసమే చదివిన. అయినా నాతోని అయితలే. ఎంత కష్టపడ్డా రావడం లేదు. అందరూ జాగ్రత్త' అని శివాని రాసిన సూసైడ్ నోట్ చదివిన వారందరూ కంటతడి పెట్టుకున్నారు.

బొల్లికుంటలో భూవివాదం

- పరస్పరదాడికి ఇరువర్గాల యత్నం

మామునూరు: ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో ఆదివారం జరిగిన ఓ భూవివాదం ఘర్షణకు దారితీసింది. గ్రామంలో ఓ స్థలానికి సంబంధించి..భూమి తమదంటే తమదని ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో దాడులు చేసుకొనే పరిస్థితి రావడంతో స్థానికులు 100 డయల్ చేయడంతో మామునూరు పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కానీ అప్పటికే సదరు భూమిలోని రేకులషెడ్డుతోపాటు గదిని కూల్చివేశారు. వంశపారంపర్యంగా తమకు సంక్రమించిన భూమిని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ భూయజమానులు గ్రామస్తుల సహకారంతో వారిపై ఎదురుదాడి చేయబోగా.. పోలీసులు లాఠీకి పనిచెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి పరుగులు పెట్టారు. అక్కడే ఉన్న కొంతమందిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేకుల షెడ్డు, గదిని కూల్చివేసి విధ్వంసం సృష్టించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బాధితులు సోల్తి రామస్వామి, సోల్తి రాజుగౌడ్ మామునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దొంతి ఇంద్రసేనారెడ్డి, అతడి అనుచరులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఒ.రమేష్ తెలిపారు.